క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): విద్యావంతులు, మేధావులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని రాఘవేంద్ర బాల కుటీర్ పాఠశాలలో ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని చెప్పారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూజల వెంకటకోటయ్య పాల్గొన్నారు.

మురుగుతో ఇబ్బందులు



రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు ఎస్సీ కాలనీలో రోడ్లపైన మురుగు ప్రవహించడంతో కాలనీ వాసులు దుర్వాసన భరించలేకున్నారు. సైడు కాలువలు లేకపోవడంతో రోడ్డుపైనే మురుగు ప్రవహిస్తోంది. రేషన్ షాపుకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. మురుగు నిల్వతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు పరిశుభ్రత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి

ఎక్సైజ్ సీఐ టి.తులసి



క్రోసూరు: క్రోసూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలోని మద్యం షాపులను సోమవారం సీఐ టి.తులసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షాపు నిర్వాహకులు మద్యాన్ని ఎమ్మార్పీ మించి విక్రయించకూడదన్నారు. అలా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ విధివిధానాలకు లోబడి షాపులు నిర్వహించాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టణంలోని ఆదరణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పరుచూరి ఝాన్సీ లక్ష్మీ పదకొండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం అన్నదానం చేశారు. వృద్ధుల పట్ల ప్రతి వారు ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని పరుచూరి శివరాంప్రసాద్ శ్రీనివాసరావు, పరుచూరి పూర్ణచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు కొమ్మవరపు రుషిత తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులతో గౌతంరెడ్డి సమావేశం



ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో న్యాయవాదులంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని వైఎస్సార్ సీపీ నేత పి.గౌతంరెడ్డి సోమవారం పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణ లో ఉన్న న్యాయవాదులతో మాట్లాడుతూ మేధావులు, ప్రతిభావంతులు ప్రతి ఒక్కరూ బాధ్యతగా డిసెంబర్ 6 లోపు ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ప్రముఖ న్యాయవాది చిట్టా విజయభాస్కరరెడ్డి, ఎల్లారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ సహాయకార్యదర్శి చిన్నం మణిబాబు, శేషయ్య, రాజవరపు శివనాగేశ్వరరావు, కాశిమాల మార్క్ పాల్గొన్నారు.

దుకాణాల అనుమతులు తప్పనిసరి

బెల్లంకొండ: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామాలలో బాణ సంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. దుకాణదారులు ముందస్తుగా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకూ గ్రామాల నుంచి ఎటువంటి దరఖాస్తులు అందలేదని తెలిపారు. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేసి బాణ సంచా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

శిథిలావస్థలో..

క్రోసూరు: మండలంలో 22 సంవత్సరాల క్రితం నిర్మించిన పోలీసు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరాయి. అదేవిధంగా నాగార్జున సాగర్ సబ్ డివిజన్ డీఈ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం ఆయా కార్యాలయాల దుస్థితి పరిశీలించి, నిధులు మంజూరు చేస్తే వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మించవచ్చని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు.

● సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం: క్రోసూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రోసూరు, అచ్చంపేట, బెల్లంకొండలోని కొన్ని గ్రామాలు, పెదకూరపాడులోని కొన్ని గ్రామాల్లో రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థలో ఉంది. కప్పుపై టార్పాలిన్ పట్టలు కప్పి నిర్వహిస్తున్నారు. రికార్డులు భద్ర చేస్తున్నప్పటికీ కొత్త భవనం అవసరం ఎంతైనా ఉంది. దీనిపై సబ్‌రిజిస్ట్రార్ విజయప్రసాద్ స్పందిస్తూ.. కొత్తగా వచ్చిన తనకు గతంలో రెండు సార్లు శంకుస్థాపనలు చేసినట్లు తెలిసిందన్నారు. అప్పటి కాంట్రాక్టర్ ప్రభుత్వం ఇంచిన అంచనాలు సరిపోవని ఉపసంహరించుకున్నారని తెలిసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కొత్త భవనం నిర్మించేందుకు అవకాశం ఉంటుందన్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



శిథిలావస్థకు చేరుకున్న ఎస్ఐ క్వార్టర్స్

నకరికల్లు: స్థానిక పోలీస్ క్వార్టర్స్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎస్ఐ క్వార్టర్స్ కూడా కూలే స్థితిలో ఉంది. 1996లో పోలీస్ సిబ్బంది నివాసముండేందుకు గ్రామ నడి బొడ్డున క్వార్టర్స్ నిర్మించారు. అలాగే చౌత్రా సెంటర్‌కు సమీపంలో ఎస్ఐ క్వార్టర్స్ ఏర్పాటు చేశారు. సిబ్బంది స్థానికంగా ఉన్నప్పుడు ప్రజలకు సత్వర సేవలు అందించవచ్చన్న సంకల్పంతో నిర్మాణం చేపట్టారు. భవనాలు నిర్మించిన నాటి నుంచి కొద్ది రోజులు మాత్రమే సిబ్బంది అందులో నివాసమున్నారు. అప్పట్లో ఇక్కడ నక్సల్స్ ప్రభావముందన్న నేపథ్యంలో అందరూ ఖాళీ చేసి వెళ్లిపోయారు. నాటి నుంచి నేటి వరకు తిరిగి ఈ భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చిన దాఖలాలు లేవు. దీంతో భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. గోడలు బీటలు వారాయి.



నకరికల్లులో నిరుపయోగంగా పోలీస్ క్వార్టర్స్

● పోలీసుక్వార్టర్స్: పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబలాతో ఉండేందుకు క్రోసూరు పోలీసు స్టేషన్‌తో పాటు 10 గృహాలు 2002లో నిర్మించారు. అవి పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. గోడలు పడిపోయి, పాములు పుట్టలు పెట్టి భయాందోళనలు కలిగిస్తున్నాయి. పది గృహాల్లో ముడు కుటుంబాలు మాత్రమే అక్కడ ఉంటున్నాయి. అక్కడ నీళ్ల రావు, స్లాబ్‌లు వర్షాలకు కారుతుంటాయి. గోడలు పడిపోతుండటంతో ఉండలేని పరిస్థితి నెలకొంది. వీటి స్థానంలో కొత్త గృహాలు నిర్మించాల్సిన అవసరం ఉందని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.



శిథిలావస్థలో పోలీసు క్వార్టర్స్

● ఎన్ఎస్ కెనాల్స్ డీఈ కార్యాలయం: క్రోసూరులోని నాగార్జున సాగర్ సబ్ డివిజన్ డీఈ కార్యాలయం అతి పురాతనమై పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గతంలో 2021లో ప్రతిపాదనలు పంపడం జరిగింది. తిరిగి కొత్తగా పంపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు డీఈ మురళీధర్ తెలిపారు.



సాగర్ కెనాల్స్ డీఈ కార్యాలయం

తాగు నీరు, పారిశుద్ధ్యంపై దృష్టిసారించాలి

అమరావతి: మండల పరిదిలోని గ్రామాల్లో ప్రజలకు తాగునీరు అందించడానికి, అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యం మెరుగు పరచడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీలు, గ్రావెల్ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగు దొడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు చేయడం జరిగిందన్నారు. అలాగే గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీఓ మాధవి, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కుమార్

అచ్చంపేట: ఇకపై ప్రతి ఐదు సోమవారాలకు ఒకసారి ప్రతి మండలంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తామని, అందుకున్న సమస్యలు మరుసటి ప్రజాదర్బార్ కల్లా పరిష్కారం కావాలని అధికారులను ఆదేశించారు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్. పరిష్కారం కాకపోతే..తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అధికారులకు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి వివిధ సమస్యలపై 276 దరఖాస్తులను ఆయన స్వీకరించారు. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించినవే వందకు పైగా ఉన్నాయి. ఇళ్ల మంజూరుకు 40కి పైగా ఉన్నాయి. మిగిలినవి పంచాయితీరాజ్, విద్య, హెల్త్, ఎన్ఆర్ఈజీఎస్, విద్యుత్, పోలీస్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. కోగంటివారిపాలెంలో అగ్రహారం భూములకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరారు. వీరభద్రస్వామి కాలనీలో మౌలిక వసతి కోసం కాలనీ వాసులు ధరఖాస్తు చేశారు. అంబడిపూడి కృష్ణానది నుంచి గ్రంథశిరికి వచ్చే సాగునీటి ఎత్తిపోతల పథకాన్ని పునరుద్ధరించాలని ఆ గ్రామస్తులు కోరారు. తాళ్ల చెరువు రెవెన్యూ పరిధిలోని కొత్తపల్లి, చెరుకుంపాలెంలో 1993 ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చిన 110 ఎకరాల భూమిని కొంత మంది ఆర్థిక ఇబ్బందుల వల్ల సాగుచేసుకోలేక పోయామని, అందులో సుమారు 25 ఎకరాల భూమిని అటవీశాఖ తమదేనంటూ తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నాంటు చెరుకుంపాలెం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పశుగణన పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో కె.శ్రీనివాసరావు, పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ స్వాతి బాధ్యత వహించగా, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రవీణ్‌కు అర్జీలు అందజేస్తున్న వివిధ గ్రామాల ప్రజలు

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.గోపాల్ అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలో సీపీఎం మండల మహా సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని, గ్రామంలో బేతంరాజు చెరువు లిఫ్ట్ ఇరిగేషన్ సత్వరమే పూర్తిచేయాలన్నారు. ప్రధాన సెంటర్‌లోని గుడిపక్కగా ఉన్న మట్టిరోడ్డు నిర్మించాలని, ముస్లిం కాలనీలో సైడు కాల్వల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు పి.పెద్దిరాజు, కౌలురైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, సీనియర్ నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి, ఈవూరి అప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న గోపాల్

బాణ సంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): బాణ సంచా దుకాణాలు నిర్వహించే వారు తప్పనిసరిగా ముందస్తు సంబంధిత శాఖల అనుమతి తీసుకోవాల్సిందేనని సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని మున్సిపల్ మీటింగ్ హాలులో సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతురావుతో కలిసి డివిజన్ స్థాయిలోని తహసీల్దార్లు, అగ్నిమాపకశాఖ, వాణిజ్య శాఖ, బాణ సంచా విక్రయాల హోల్‌సేల్, రిటైల్ డీలర్లతో దుకాణాల నిర్వహణ, భద్రతా చర్యలపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి మాట్లాడుతూ దీపావళి పండుగను పురస్కరించుకొని ఏర్పాటు చేసే స్టాళ్లకు అనుమతులు తీసుకోవాలన్నారు. నిబంధనల మేర దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారా లేదా అని రెవెన్యూ సిబ్బంది తనిఖీలు చేయాలన్నారు. నిబంధనలు పాటించకుండా దుకాణాలు ఏర్పాటు చేసిన వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. లైసెన్స్ ఇచ్చే ముందు దుకాణాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ శాఖ, అగ్ని మాపకశాఖ, పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఎక్కడ పడితే అక్కడ దుకాణాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. దుకాణాలు ఉన్న చోట పార్కింగ్ , అందరికీ అర్థమయ్యేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల వద్ద నీటి సౌకర్యం అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు, అగ్నిమాపక శాఖ అధికారులు, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, దుకాణాల నిర్వాహకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, డీఎస్పీ హనుమంతరావు

బాణ సంచా దుకాణంలో తనిఖీలు

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): సత్తెనపల్లి మండలంలోని దూళిపాళ్ళలో సమీపంలో గల శ్రీవిఘ్నేశ్వర ఫైర్‌వర్క్స్ బాణ సంచా హోల్‌సేల్ దుకాణాన్ని సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంత్‌రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. దుకాణం అనుమతి పత్రాలు, నిల్వలను, రికార్డులను పరిశీలించారు. దుకాణం వద్ద తీసుకున్న రక్షణ చర్యలను తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. తహసీల్దార్ శ్రీనివాసచక్రవర్తి, ఆర్.ఐ, వీఆర్వో తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): పెరుగుతున్న పట్టణ పరిధితో పాటుగా కార్మికుల సంఖ్యను పెంచాలని, పని భారం తగ్గించాలని, రక్షణ పరికరాలను సకాలంలో అందించాలని సీఐటీయూ పట్టణ సహాయ కార్యదర్శి జడ రాజ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న రాజ్‌కుమార్ మాట్లాడుతూ రోజు రోజుకి పట్టణ పరిధి పెరుగుతున్నప్పటికీ కార్మికుల సంఖ్య మాత్రం పెరగటం లేదన్నారు. రక్షణ పరికరాలైన చెప్పులు, సబ్బులు, గ్లౌజులు, గంబుట్లు, కొబ్బరి నూనె, మాస్కులు, చీపుర్లు తదితర వస్తువులు ఇవ్వాలన్నారు. విజయవాడలో వరదలు వచ్చిన సందర్భంగా సత్తెనపల్లి నుంచి వెళ్లిన కార్మికులకు రెండు జతలు దుస్తులు ఇవ్వాలన్నారు. ఒక నెల బోనస్ ఇవ్వాలని, అదే విధంగా పుస్కాట్లు మరమ్మతులు చేయించాలన్నారు. జిల్లా నాయకురాలు చంద్రకళ మాట్లాడుతూ పీఎఫ్ పెద్ద సమస్యగా ఉందని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం ధర్నా నిర్వహించి మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మ రాజశేఖర్, ప్రభుకుమార్, జల్ది రమేష్, చిలకా సునీత తదితర కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ప్రతి ఇంటిలో దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు

పెదకూరపాడు: దీపావళి పండుగ పురస్కరించుకుని సోమవారం మండలంలోని బలుసుపాడు గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ సభ్యులు దీపావళి విశిష్టతను వివరించారు. 'గురువు తన జ్ఞానాగ్నితో శిష్యుల తలలో జ్ఞాన జ్యోతి వెలిగించి యోగ మార్గంలో నడిపిస్తాడనడానికి గుర్తుగా దీపావళి రోజున ఇంట్లో దీపాలు వెలిగించాలన్నారు. శరీరం బయట అంతటా విశ్వాన్ని నడిపే పరమాత్మ శక్తి ఉంది అనేందుకు గుర్తింపుగా ఇంటి బయట కూడా దీపావళి రోజు దీపాలు వెలిగించాలన్నారు. ఇంటి బయట దీపాలు వెలిగించడం పరమాత్మ శక్తికి సంబంధించిన గుర్తుగా భావించాలన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి–ఇందూ జ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు, సభ్యులు రౌతు శ్రీనివాస రావు, కృష్ణారావు, శివలింగం నాయక్, బ్రహ్మం, హరిబాబు, రామోజీ నాయక్, పట్టాభి శ్రీను, సుబ్బారావు, గోపి, ప్రకాష్, సుధాకర్, అన్నపూర్ణ, ప్యారమ్మ, దిల్ ష, విద్య, చంద్ర గౌరీ పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

'పీఎం సూర్య ఘర్'కు రాయితీలు

● విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ పి.విజయ్‌కుమార్
● క్రోసూరు సబ్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

క్రోసూరు: ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలు పీఎం సూర్య ఘర్ స్కీమ్‌ను వినియోగించుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ పి.విజయకుమార్ అన్నారు. క్రోసూరులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సోమవారం ఆయన తనిఖీంగా తనిఖీ చేశారు. ఆయన వెంట సత్తెనపల్లి డీఈఈ కె.రాజశేఖరబాబు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ పీఎం సూర్య ఘర్ స్కీమ్ ద్వారా ఒక కేవీకి రూ.30 వేలు, రెండు కేవీకి రూ.60 వేలు, మూడు కేవీకి రూ.78 వేలు సబ్సిడీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అదేవిధంగా మండలంలో 80 శాతం బిల్లులు వసూలు చేసినట్లు తెలిపారు. మిగతా 20 శాతం త్వరలో పూర్తి పూర్తి చేసి లక్ష్యం చేరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండలం విద్యుత్ ఏఈ బసవరాజు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ పి.విజయ్‌కుమార్

విగ్రహం విషయంలో వితండ వాదం..

ఆవులవారిపాలెం(క్రోసూరు): డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనుల విషయంలో వైఎస్సార్ విగ్రహం అడ్డుగా ఉన్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ పున్నారావు మొండి వైఖరిగా మాట్లాడుతున్నాడని గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులు అంటున్నారు. మండలంలోని ఆవులవారిపాలెంలో ప్రధాన రహదారి పక్కగా ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద డ్రెయినేజీ నిర్మాణంపై వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ విగ్రహం తొలగించకుండా మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఫిర్యాదు చేయడంతో జిల్లా కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు అప్పటి ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీనివాసరావు గ్రామానికి చేరుకుని విగ్రహం తొలగించకుండా పనులు చేయాలని ఆదేశాలిచ్చారు. మార్కింగ్ చేసి వీఆర్వో, సెక్రటరీ, గ్రామ నౌకర్‌లను ఆదేశించారు. అయితే సోమవారం గ్రామానికి వచ్చిన ఆర్అండ్‌బీ ఏఈ పున్నారావు పనులు చేయవద్దని ఆదేశించినట్లు వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. విగ్రహం జోలికి పోకుండా నేరుగా కాలువ ఉన్నప్పటికీ ఏఈ వితండ వాదన చేస్తున్నాడని తెలిపారు. దీనిపై సాక్షి ఏఈ వివరణ కోరగా తహసీల్దార్ నోటిమాట సరిపోదని, తనకు రాతపూర్వకంగా ఉండాలన్నారు. తహసీల్దార్‌ను సంప్రదించి ముందుకు సాగుతానని చెప్పారు.



వైఎస్సార్ విగ్రహం ముందు డ్రెయిన్ పనులు

న్యాయమూర్తికి సత్కారం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): సత్తెనపల్లి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్), సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ సీహెచ్ వెంకట నాగశ్రీనివాసరావు జిల్లా జడ్జి గా పదోన్నతి పొందిన సందర్భంగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. గుంటూరు పట్టణంలోని మూడవ అదనపు జిల్లా జడ్జి గా వ్యవహరించనున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు గుజ్జర్లపూడి మార్క్, దివ్వెల శ్రీనివాసరావు, కార్యదర్శి మన్నెం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాటిబండ్ల రవి, ఈసీ మెంబర్స్ తాళ్లూరి విజయ్‌భరత్, బాదినేడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహంలో చోరీ

ముప్పాళ్ళ(సత్తెనపల్లి):పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ గృహంలో నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఘటనకు సంబంధించి పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలోని రాంబాబు కుటుంబ సభ్యులు ఈ నెల 25 శుక్రవారం హైదరాబాదులోని కుమార్తె వద్దకు వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చే సరికి ఇంటికి వేసిన తాళం పగలకొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. సమాచారాన్ని పట్టణ పోలీసులకు అందించడంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరి వివరాలు సేకరించారు. బీరువాలోని కొంత నగదు, కొంత బంగారు అభరణాలు అపహరణకు గురైనట్లుగా పోలీసులకు రాంబాబు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): ఈ నెల 30న పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని మీటింగ్ హాలులో కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి సోమవారం తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే సమావేశానికి గౌరవ సభ్యులు హాజరుకావాలని కోరారు.

నిండా ముంచిన అకాల వర్షాలు



తాడికొండ: ఖరీఫ్‌లో అన్నదాతలకు అడుగడుగునా అడ్డుకున్న అకాల వర్షాలు, రబీ సీజన్ ఆరంభంలోనూ తమ ప్రతాపాన్ని చూపించాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో గత 20 రోజుల క్రితం రబీ సీజన్ కింద రైతులు వేలాది ఎకరాల్లో మినుము పంట సాగుకు శ్రీకారం చుట్టారు. వెద వేసిన వెంటనే అకాల వర్షాలు, అల్పపీడనం దెబ్బకు వరుసగా 15 రోజుల పాటు విడవకుండా కురవడంతో పరిస్థితి తారుమారైంది. నీరు నిలిచి మినుము పైరు ఎర్రబారడంతో రైతులు పంటను కలియదున్నాల్సిన పరిస్థితి వచ్చింది. వందలాది ఎకరాల్లో పంటలను దున్నేస్తున్న తమను ఆదుకునేందుకు ప్రభుత్వం రాయితీపై ఎరువులు, విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పోలీసు స్టేషన్‌లో బైకు దొంగతనం!

శావల్యాపురం: పోలీసుస్టేషనులో బైకు మాయమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం ప్రకారం.. శావల్యాపురంలో పోలీసు స్టేషను కూతవేటు దూరంలో ఉన్న పోలేరమ్మ దేవాలయంలో చోరీ చేయడానికి గుర్తు తెలియని వ్యక్తి ఒకరు బైకుపై వచ్చాడు. అదే సమయంలో స్థానికులు గుర్తించి సదరు వ్యక్తిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేయగా తప్పించుకొని పారిపోయాడు. గ్రామస్తులు బైకును (ఏపీ 07 బీఎస్ 3406) స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషనులో అప్పగించారు. అయితే స్టేషను బయట ఉంచిన ఈ బైకును ఎవరో అపహరించారు. సోమవారం జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి విచ్చేసిన వినుకొండ రూరల్ సీఐ బి. ప్రభాకర్‌ను గ్రామస్తులు అడగ్గా బైకు సత్తెనపల్లికి చెందిన సంతోష్‌దిగా గుర్తించామన్నారు. దీనిపై విచారణ జరుగుతోందని నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ఇళ్ల మధ్య మద్యం షాపులు తొలగించాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రజలకు ఇబ్బందులు లేకుండా మద్యం వ్యాపారులు తమ దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి వైదన వెంకట్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గుడి, బడికి 100 మీటర్ల దూరంలో ఉండేలా మద్యం షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణంలో కొన్ని ప్రాంతాలలో ఏర్పాటు చేసిన షాపులు జనవాసాల మధ్య ఉండటంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు వాటిని తొలగించి వేరే ప్రాంతాలలో నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.